# సుందరమ్మ కూతురు

మంగమ్మ కాస్త దూరాన ఉండంగానే చూచి, 'రా వదినా, రా' అని పిలిచింది సుందరమ్మ.

మంగమ్మ ముసిముసి నవ్వులు నవ్వుకొంటూవచ్చి కూర్చుని, 'ఏం వదినా పోట్లాడుకొన్నారుటగా కూతురూ అల్లుడూ' అని అడిగింది, 'అప్పుడే నీ దాకా వచ్చిందీ' అన్నది సుందరమ్మ నవ్వుతూ.

'ఏం వదినా అల్లా అంటావు. నేనేనా అంత వినకూడనిదాన్ని. ఏవో సరదా విషయాలు కాబట్టి అడుగుతున్నానుగాని మరో విషయం అయితే అడుగుతానా వదినా!' అన్నది మంగమ్మ.

సుందరమ్మకూ సరదాగానే ఉంది. ఈ విషయము ఇంకోరితో చెబుదామని! అయినా అన్నది. 'అది కాదు వదినా. నీవు వినకూడదని కాదు. ఇందులో తప్పు విషయం ఏముందిలే కాకపోయినా అసలు నీకు ఈ విషయం ఎవ్వరు చెప్పారూ' అని!

'నిన్న సాయంత్రం సూరమ్మ అత్తయ్య వచ్చిందటగా మీ ఇంటికి. ఆమెకేమో కాస్తాకూస్తో తెలిసి ఉంటుంది. సూరమ్మే అన్నది శర్మ జానకీ మళ్ళీ పోట్లాడుకొన్నారటే అని. పడుచువాళ్ళ పోట్లాటలంటే ఎవరికైనా సరదాగానే ఉంటుంది వింటానికి. ఏమిటి సంగతి చెబుదూ' అని అడిగింది మంగమ్మ.

సుందరమ్మ ఇల్లా చెప్పింది.

'ఏమో వదినా, ఏం పోట్లాటలో ఏమి సంగతో నాకేం అర్థం కాలేదు. చిన్నతనంలో వున్నారు కదా! చిలకాగోరంకలలాగ ఉండరాదూ ఇద్దరూనూ! ఏదో ఒక విషయమై తగూవస్తునే ఉంటుంది వదినా!'

మంగమ్మ నవ్వి, 'ఏమంత పెద్దపోట్లాటలు వదినా! వీటికేం, సరదాగానే ఉంటవి కాస్త చెబుదూ వింటాను' అని అడిగింది.

సుందరమ్మ చెప్పుకొచ్చింది.

‘శర్మ సంగతి ఏమీ బాగుండలేదు వదినా. తను ఏదో ఆఫీసులో గుమాస్తా కదా, ఆ పని ఏదో చూచుకోకూడదూ’ ఎప్పుడూ దానికొంగు పట్టుకు తిరక్కపోతే వంట ఇంట్లోకి వెడితే వంటింట్లోకి దొడ్లోకి వెడితే దొడ్లోకి తయారు’. ‘దొడ్లోకి కూడా ఎందుకమ్మా?’ ఆశ్చర్యపోతూ అడిగింది మంగమ్మ.

‘దొడ్లో ఎర్రగన్నేరు పూలున్నయ్యే అవన్నీ కోసి దాని ఒళ్ళో పోస్తాడు. దానికెందుకు అన్ని పూలు! ఏదో నేనూ చూచీ చూడనట్టు ఊరుకొంటాను చెప్పద్దూ’ అన్నది సుందరమ్మ.

‘అవునులే నీకు ఈ గొడవలన్నీ పట్టినయి. నీవంటా, పూజా పునస్కారము దానితోనే సరిపోతుంది’ అంటూ మంగమ్మ సుందరమ్మను మెచ్చుకొన్నది.

నిజం కూడా అంతే.

కూతురు కాపురం జూచి సుందరమ్మ ఊ మురుసుకొంటుంది. ఈ తగూవైనా కళా ప్రసక్తమైన రసవత్ వినోద ప్రదర్శనాలూన్నూ ప్రణయపూరితమైన అతని హృదయంలో కలిగిన స్పందనానికి ఫలితములూ కాబట్టే ఆ ముసలమ్మగారు సంతోషంతో చెపుతూ ఉంటుంది. ఆ పడుచు దంపతుల దాంపత్య జీవితంలోని మధురమైన ఘట్టాలను గురించి.

మంగమ్మకైనా యాభై ఏళ్ళు దాటినయి. దాంపత్య జీవితంలోని మాధుర్యాన్ని అంతో ఇంతో ఆవిడ ఇదివరకే అనుభవించింది. ఇప్పుడల్లా ఇతరుల అనుభవాలను విని సంతోషించే వయస్సు.

‘ఆ ఎందుకు పోట్లాడుకొన్నారూ శర్మా జానకీని’ – అని మళ్ళీ అడిగింది మంగమ్మ. సుందరమ్మ గోడకు వీపు ఆనించి కళ్ళు మూస్తూ తెరుస్తూ కథ లాగ చెప్పుకొచ్చింది.

‘ఏమైందీ అంటే శర్మ ఆఫీసు నుంచి అయిదు గంటలకు వచ్చాడు వదినా! వచ్చి జానకీ, జానకీ అని పిలిచాడు. పేరు పెట్టే పిలుస్తాడులే’.

‘ఇప్పుడంతా అంతేగా వదినా అని మంగమ్మ ఓ మాట దొర్లించి, చెప్పమన్నట్లు చూచింది.

సుందరమ్మ మళ్ళీ కథ ఇట్లా చెప్పింది.

'జానకీ, జానకీ అని పిలిస్తే జానకి చప్పున పలకలేదమ్మ. అదీ వచ్చిన ఖర్మం.'

'ఎందుకు పలకలేదూ?'

ఎట్లా పలుకుతుందమ్మా. తనేమో వాకిట్లో ఉండే అమ్మాయేమో నా దగ్గర వంటింటి వసారాలో కూర్చున్నదాయె! ఈ మూల వీధివాకిలీ, ఆ మూల దొడ్డి వాకిలీనూ.'

'ఇంకే పలకలేదని కోపం వచ్చింది కామాలు'.

'ఎందుకమ్మా కోపం. ఎక్కడోలోపల ఉందేమోనని కాస్త బిగ్గరగా పిలిస్తే తన సొమ్మేమిపోయింది వదినా. ఆ మాత్రం తెలియక్కరలేదు శర్మకు. చిన్నవాడా చితకవాడా పాతికేళ్ళు పైకొచ్చెగదా!'

'ఆ పిలవటం అయినా ఎట్లా పిలుస్తాడనుకొన్నారు. అయ్యో! అయ్యో! ఆ తమాషా కూడా చూడాలిసిందే. అదేం నాజూకో. జానకీ, జానకీ అని పిల్లికూన లాగ అంటాడు.

అల్లా అంటే దగ్గరున్న వాళ్ళకే వినపడదు గదా! దానికేం వినపడుతుందీ! వినపడక పలకలేదు. పలక్కపోతే కోపం వచ్చింది కామాలు తలుపు రాతామని కొట్టాడు. ఇంట్లో ఉండేవాళ్ళు హడిలిపోయేలాగున'.

'జానకికి అప్పటికీ వినపడలేదో?'

'వినపడకేం వదినా. వినపడ్డది. వినపడ్డ వెంటనే పరుగెత్తుకుంటూ వెళ్ళిందమ్మా బిడ్డ. వెళ్ళి నవ్వుతూ ఏమండీ పెందరాళే వచ్చారే ఇవ్వాళ అంటూ తలుపు తీసిందమ్మా మామూలుగానే. పాపం దీనికేం తెలుసు. అప్పటికే ఆయన కడుపులో ఆలోచనలన్నీ ఉన్నయ్యని.

ఏమైందనుకొన్నావు వదినా, నీవు చెపితే నమ్మవుగాని, నేను నిజంగా అట్లా అవుతుందనుకోలేదు. తలుపు తియ్యలేదని కోపం వస్తే మటుకు ఎంత సేపుండాలె ఆ కోపం. క్షణంలోకి పోవద్దా.

'అయ్యో, ఏమైంది అనుకున్నావు తలుపు తీసిందా, అల్లుడు, రోజూలాగ కాక కొరకొరా జూస్తూ, జానకిని మాట్లాడించనైనా మాట్లాడించకుండా తన ఆఫీసు గదిలోకి

బుసలు కొట్టుకుంటూ వెళ్ళిపోయినాడు.

తలుపు వెంటనే తియ్యలేదనేగా తనకు కోపం. పోనీ అడగకూడదూ ఏమే జానకీ, ఏం జేస్తున్నావులోపల ఎందుకు తలుపు తీయలేదని అడిగితే చెప్పేదేగదా! అడగనూలేదు పెట్టనూలేదు.

అయ్యగారు మూతిమూరెడు చేసి కొని గదిలోకి వెళ్లి తలుపు ఠాక్కున వేసుకొన్నాడు.

నిజం మాటకు జానకి తప్పేముంది చెప్పు! ఆయన ఆఫీసు నుండి వస్తాడు వచ్చేటప్పటికల్లా కాఫీ ఫలహారమూ తయారు చెయ్యాలనేగా జానకి తొందర పడుతున్నది. ఏమంటావు? తన కోసమేనా మధ్యాహ్నం నుంచి అది సతమతం అయిందా!

ఏమైందనుకొన్నావు వదినా, సమయానికి ఇంట్లో శెనగపిండి లేకపోయిందమ్మాయ్. అమ్మాయి ఏంజేసిందనుకొన్నావు వదినా, దాని తెలివితేటలకు చెబుతాను. అప్పటికప్పుడు అప్పిని బ్రతిమిలాడి బజారుకు పంపించి పిండి తెప్పించి బజ్జీలు వండించింది. తన కోసమేగా ఈ అవస్థ అంతా! ఈ సంగతి కాస్త గ్రహింపు ఉండాలంటావా?

'ఉండొద్దుటమ్మా! ఈ మగవాళ్ళకు ఉండే లక్షణమే అల్లాంటిదిలే. నేనెరగనో ఏమిటి! అవతలవాళ్ళు తమకోసం ఎంత ఇదైపోతున్నారో చూడరమ్మోయ్ మగవాళ్ళకు ఆ మాత్రం గ్రహింపు ఉంటే ఇంకా అనుకోవలసిందేముంది! ఊ ఏమైంది అప్పుడు! అల్లుడు ఏం జేసాడూ?'

'అదే నమ్మ చెప్పొస్తున్నాను. జానకి వంక కత్తులు మెరిపించి వెళ్ళిపోయినాడా, జానకి ఏమీ మాట్లాడలేదు. పోయి ఏముందమ్మా, తలుపు వేసుకొన్నాడు మాటాపలుకూ ఏమీ లేదు. చూశావా. వదినా చటుక్కున కాస్తకూ కూస్తకూ ఇల్లాగ ముడుచుకు పోతుంటే. ఆడది కాపరం చెయ్యటం కష్టము అనుకో. ఆయనగారికి కోపం వచ్చిందని జానకికి తెలిసిందే అనకో తెలిస్తే మటుకు ఏంజేస్తుంది వదినా? మగవాళ్ళకు కోపం వచ్చినప్పుడు కాసేపు మాట్లాడకుండా ఉంటే అదే పోతుంది అనుకొన్నదమ్మా. అనుకొని ఊరుకొంది. ఊరుకోటం తప్పు అయిందమ్మా మళ్ళీ!"

'ఊరుకోక ఏం జెయ్యాలె వదినా?'

'అదేనమ్మా ఊరుకోకూడదట. ఏదో ఇంగ్లీషుతో అనాలెటమ్మా ఏదో చెప్పింది. నాకు రాదు చచ్చి.'

'ఎక్స్యూజ్‌మి అనాలెట వదినా! అదేమిటమ్మా ఎందుకూ అల్లాగ అనటం! ఎక్కడైనా విన్నామా? ఎప్పుడైనా ఎరుగుదుమా మనము! నలభై ఏండ్లు మొగుడుతో కాపరం చేశాను నేనెప్పుడూ అనలేదు వదినా అల్లాంటిమాటలు. నా కూతురు మటుకు ఎందుకు అనాలే అంటా! ఛీఛీఛీ అల్లాంటి మాటలూ, చేసుకొన్న మొగుడుతో అంటారా? ఎవరో అప్రాశ్యులు అనుకోవలసిన మాటలు? ఆ మాట అనాలటమ్మా ఆ మాట అనలేదని ఆయనగారు అసలే మూతిమూరెడు చేసుకొన్నాడా ఇప్పుడు బారెడు చేసుకొన్నాడు. అయ్యో అయ్యో. ఇదెక్కడి విడ్డూరం! 'అది సరే కాని పోనీ అనలేకపోయిందా ఆ మాట ఏమిటి?'

'అనకపోయిందా అంటే ఒకటొచ్చింది. పోనీ అనవే అమ్మాయీ, ఆయన ఏది అనమంటే అది అను అమ్మా. ఎందుకొచ్చిన తగూలు ఇవి. అని నేనూ చెప్పానమ్మోయి. మా జానకికి! వచ్చిన ఖర్మం ఏమిటీ అంటే, ఆ సమయానికి దానికా మాట జ్ఞాపకమే రాలేదో తోచలేదో. ఏదో అయింది. ఇంతకూ లేచినవేళ మంచిది కాదనుకో'.

'ఇదమ్మా కారణం. ఇక ఆయన మండిపోయినాడు వదినా. చెపితే నమ్ముతావో నమ్మవోకాని, ఆయన కోపం ఇంతా అంతా కాదు. కొఱ కొఱ చూశాడు. దాన్ని కొఱుక్కు తినేట్టు 'కొఱుక్క మాన్తాడా! ఎందుకు అనకపోవాలె ఈ భడవా'.

'చెప్పాను గదటమ్మా ఆ సమయానికి తోచలేదనీ నీవూ అల్లాగే అంటావేం వదినా. కొడుకును వెనకేసుకొని వస్తావు! పోనీ అనలేదే అనుకో! పొరపాటే అయింది. అనకపోతే ఎందుకు అనలేదు అని అడగాలా? అడిగితే కారణం చెప్పేదిగా! అడక్కుండానే సంగతేమిటో తెలుసుకోకుండానే ముదుచుకుపోతే ఎల్లాగమ్మా కాపరం చేసేది! ఏమంటావు?'

'నిజమే మరి. ఏదైనా తప్పు ఉంటే ఎందుకిట్లా చేశావని అడగాలె. దండించాలె. ఆ మాటా నిజమే!'

'అడగటం లేదు పెట్టటం లేదు. అల్లాగ పడకకుర్చీలో పడుకొని ఊరుకొన్నాడు'.

'జానకి హడలిపోయింది వదినా! నాతో అన్నదమ్మాబిడ్డ. తలుపు వెంటనే తీయకపోతే ఆయన పాపం వీధివాకిట్లో చాలాసేపు నుంచున్నాడు. అప్పుడు ఎక్స్క్యూజ్‌మీ అనాలె అమ్మా! అల్లాగ అనాలి అని చాలాసార్లు చెప్పారే. సమయానికి తోచక అనలేదే అమ్మా – అని ఊరికే గిలగిల్లాడిందమ్మా బిడ్డ.

నే జెప్పేదీ, ఆయన అట్లా ముడుచుకుపోతే, ఏమమ్మా! పిల్లది తప్పే అనుకో. అదేదో అనవలసిన మాట చిన్న సన్యాసి అనకపోతే ఒకటికి నాలుగు సార్లు చెప్పి అనిపించుకోవాలెగాని ఇల్లాగ అయితే ఎల్లా వదినా!'

'ఆ మాటా నిజమే: చెప్పాలిసింది చెప్పినా అనకపోతే, భడవా, ఎందుకనలేదు, ఇన్నిసార్లు చెప్పినా అది అనవచ్చుగా!'

'అదే మొదలు వదినా. ఇక ఇద్దరికి మాటలు లేవనుకొ. నేనూ అనుకోలేదు వదినా ఆయన కడుపులో ఇంత ఉద్దేశం పెట్టుకొన్నాడని! నేనేమిటి ఎవరైనా అనుకొంటారా చెప్పు. ఏదో ఒక మాటగదా అది అనకపోతే పిల్లను నానా అల్లరి చేస్తాడా!'

'ఏమి అల్లరి చేశాడు వదినా.'

'అదీ చెపుతాగా వినరాదూ; బజ్జీలు చేశాగా. అవి నాలుగు వెండి పళ్ళెంలో పెట్టి ఇచ్చి రావే అమ్మాయీ అన్నాను. అది తీసికెళ్లి ఇచ్చింది. వెధవది నవ్వా వస్తుంది, విచారమూ వస్తుంది. ఇస్తే బజ్జీలన్నీ తిన్నాడమ్మోయ్! జానకి మరి కాసిని తీసికెళ్ళి వేస్తే మాట వరసకైనా అక్కరలేదు అనకుండా శుభ్రంగా తిన్నాడు. కాఫీ కూడ తాగాడు. అప్పటికైనా కోపం పోవాలంటావా!'

'పోలేదా!'

'ఊహూ అదే వెధవది మనస్సుకు ఎంతో కష్టంగా ఉంటుంది. శుభ్రంగా తిని పైనుత్తరీయం వేసుకొని గబగబా వెళ్ళిపోయినాడు.

'వెళ్ళిపోతే జానకికి కోపం ఎందుకూ!'

*('హారతి' మాసపత్రిక, సెప్టెంబర్ 1950)*